హైదరాబాద్
23-9-2023
సంపుటి:08
సంచిక: 360
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కమలంలో కలకలం!

- బీజేపీ ముఖ్యనేతలు పలువురు పార్టీ వీడొచ్చంటూ ప్రచారం
- తమకు తగిన ప్రాధాన్యం, గుర్తింపు దక్కడం లేదంటూ కినుక
- పార్టీ అధిష్టానం, పలువురు అగ్రనేతల తీరు, ఇతర అంశాలపై చర్చ

హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. మరో రెండు వారాల్లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడొవచ్చనే అంచనాల నేపథ్యంలో...పార్టీలో ఏర్పడుతున్న పరిస్థితులు కమలనాథుల్లో కలవరం పుట్టిస్తున్నాయి. ఇటీవల జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ జి.వివేక్ వెంకటస్వామి నివాసంలో పలువురు అసంతృప్త నేతలు భేటీ అయ్యారు. ఇతర జాతీయ కార్యవర్గసభ్యులు విజయశాంతి, గరికపాటి మోహన్‌రావుతో పాటు మాజీ

2లో





## బీఆర్ఎస్‌కు మైనంపల్లి రాజీనామా

**కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ దక్కకపోవడంతో కినుక**

హైదరాబాద్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఒక వీడియో ప్రకటనను ఆయన విడుదల చేశారు. మల్కాజిగిరి ప్రజలు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకే ముందుకు నడుస్తానని, దేనికీ లొంగే ప్రసక్తి లేదని వ్యాఖ్యానించారు.మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి బీఆర్ఎస్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మైనంపల్లి తన కుమారుడు రోహిత్‌కు మెదక్ నుంచి పార్టీ టికెట్ ఆశించారు. ఈ క్రమంలో గత నెల 21న బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించడానికి కొన్ని గంటల ముందు మంత్రి హరీశ్‌రావుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయినా సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన మైనంపల్లికే మరోమారు టికెట్ కేటాయించిన కేసీఆర్.. రోహిత్‌కు మాత్రం టికెట్ ఇవ్వలేదు. దీంతో మైనంపల్లి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జరిగినా బీఆర్ఎస్ వేచి చూసే ధోరణి అవలంభించింది. ఈ నెల 26న ఢిల్లీలో సోనియా, రాహుల్ సమక్షంలో మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరిక ఖాయం అయ్యింది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. నెల రోజుల క్రితం మైనంపల్లి ధిక్కార స్వరం వినిపించిన మరుక్షణం నుంచే కేసీఆర్



2లో

## ఎన్డీయేలోకి జేడీఎస్

**బీజేపీ అధిష్ఠానం పెద్దలతో కుమారస్వామి కీలక భేటీ**

బెంగళూరు, బీజేపీ, జేడీఎస్ చేతులు కలిపాయి. ఢిల్లీలో గత రెండు రోజులుగా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ...ఆయన తనయుడు కుమారస్వామి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో చర్చలు జరిపారు. ఆ తరువాత ఎన్డీయేలో చేరాలని తీర్మానించుకున్నారు. వరుస సమావేశాల అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఢిల్లీలో శుక్రవారం ఒక ప్రకటన చేశారు. జేడీఎస్ చేరికతో ఎన్డీయే మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. త్వరలో ఉభయపార్టీల నేతలు మళ్లీ సమావేశమై సీట్ల సర్దుబాటుపై

## 70 సీట్లలో వడపోత పూర్తి!



- కాంగ్రెస్ పార్టీలో కొలిక్కి వస్తున్న అభ్యర్థుల ఎంపిక
- ఢిల్లీలో రెండో రోజు ఐదు గంటల పాటు కసరత్తు చేసిన స్క్రీనింగ్ కమిటీ
- 40 చోట్ల ఏకాభిప్రాయంతో ఒక్కో పేరు.. మరో 30 స్థానాలకు రెండేసి పేర్లు
- పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలనకు పంపనున్న స్క్రీనింగ్ కమిటీ
- మిగతా 50 స్థానాల ఖరారుపై మరోమారు భేటీకి నిర్ణయం
- పలు నియోజకవర్గాల విషయంలో కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం
- రేవంత్‌ను కలిసిన వీరేశం, రేఖానాయక్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కి వస్తోంది. అభ్యర్థుల ఎంపికపై కొన్నిరోజులుగా కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ.. భిన్నాభిప్రాయాలు, విభిన్న వాదనల మధ్య 70 నియోజకవర్గాలకు సంబంధించి వడపోతను పూర్తి చేసినట్టు తెలిసింది. ఇందులో నలభైకి పైగా సీట్లకు ఒక్కో అభ్యర్థి పేరును, మరో 30 సీట్లకు ఇద్దరి పేర్ల చొప్పున ఫైనల్ చేసినట్టు సమాచారం.

2లో



## భవిష్యత్తుకు భరోసా!

మంత్రి కేటీఆర్ సమక్షంలో కలిసిన రాజయ్య, కడియం శ్రీహరి. చిత్రంలో పల్లా

- అసంతృప్త నేతలను బుజ్జగిస్తున్న బీఆర్ఎస్ అధిష్టానం
- కొలిక్కివస్తున్న టికెట్ల పంచాయితీ
- 'పల్లా'కు జనగామ టికెట్ ఖరారు
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి రైతుబంధు సమితి చైర్మన్ పదవి?
- ప్రగతిభవన్ వేదికగా కడియం, రాజయ్యల మధ్యా కుదిరిన సయోధ్య
- త్వరలో నర్సాపూర్, కల్వకుర్తి నేతలతో చర్చలు

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో రాజుకున్న వేడి క్రమంగా చల్లబడుతోంది. పార్టీ నేతల మధ్య సయోధ్యకు జరుగుతున్న ప్రయత్నాలు ఒకటొకటిగా కొలిక్కి వస్తున్నాయి. జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని బుజ్జగించిన అధినేత కేసీఆర్.. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆ నియోజకవర్గం టికెట్ ఖరారు చేశారు. మరోవైపు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, తాటికొండ

2లో

## ఓబీసీలపై కాంగ్రెస్ సవతి ప్రేమ

### అధికారంలో ఉండగా వారి గురించి ఆలోచించనైనా లేదు: నడ్డా

### దేశానికి తొలి ఓబీసీ పీఎంను ఇచ్చింది బీజేపీయే

### మహిళా బిల్లుపై రాజ్యసభలో చర్చలో బీజేపీ చీఫ్

### రాహుల్ 'ఓబీసీ కార్యదర్శుల' వ్యాఖ్యలపై నిప్పులు

న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల ఓబీసీ కోటా కూడా కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా దుమ్మెత్తిపోశారు. వారిపై కాంగ్రెస్ ప్రేమ మాటలకే పరిమితమన్నారు. అధికారంలో ఉండగా ఓబీసీలకు కాంగ్రెస్ చేసిందేమీ లేకపోగా కనీసం వారి గురించి ఆలోచించను కూడా లేదని ఎద్దేవా చేశారు.నరేంద్ర మోదీ రూపంలో దేశానికి తొలి ఓబీసీ పీఎంను ఇచ్చింది బీజేపీయేనని గుర్తు చేశారు. మహిళా బిల్లుకు ఉద్దేశించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతివ్వాలని అన్ని పార్టీల ఎంపీలను కోరారు. బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించడం తెలిసిందే.

**రాహుల్ ది ట్యూటర్ తెలివిడి**

2004 నుంచి పదేళ్ల పాటు కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమి పాలనలో కేంద్రంలో ఎందరు ఓబీసీ కార్యదర్శులున్నారో చెప్పాలని నడ్డా ప్రశ్నించారు. సర్వీసుల్లో ఉన్న అధికారులకు సంబంధించి ఓబీసీ రిజర్వేషన్లను కేవలం 1992లో సుప్రీంకోర్టు సూచన అనంతరం మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. 90 మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల్లో ఓబీసీలు కేవలం ముగ్గురే ఉన్నారన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపణలను ఉద్దేశించి ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ట్యూటర్లను పెట్టుకుంటే చాలదు. నాయకుడు కావాలంటే చిత్తశుద్ధితో అందుకోసం ప్రయత్నించాలి' అంటూ ఎద్దేవా చేశారు. '303 మంది



బీజేపీ లోక్ సభ సభ్యుల్లో 85 మంది ఓబీసీలే. ఇది కాంగ్రెస్ మొత్తం సభ్యుల కంటే కూడా చాలా ఎక్కువ! దేశవ్యాప్తంగా మా పార్టీకి ఉన్న ఎమ్మెల్యేల్లో 27 శాతం, ఎమ్మెల్సీల్లో ఏకంగా 40 శాతం ఓబీసీలే. మహిళా సాధికారత కోసం మోదీ సర్కారు ఎన్నో చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ మాత్రం కేవలం మైనారిటీల

2లో

# బీఆర్ఎస్‌కు మైనంపల్లి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టారు. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీంతో ఇప్పటికే రాజశేఖర్‌రెడ్డి పార్టీ కేడర్‌తో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మైనంపల్లి రాజీనామా నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని త్వరలోనే ప్రకటించే అవకాశముంది.

**ఎంపీగా పోటీ చేసిన మర్రి**

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2019లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేతిలో 11 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈసారి కూడా మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచే ఆయన పోటీ చేస్తారని భావించినా, తాజా పరిణామాల నేపథ్యంలో మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే టికెట్‌ను ఇచ్చి, సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయించే యోచన లో కేసీఆర్ ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# ఎన్డీయేలోకి జేడీఎస్


(మొదటి పేజీ తరువాయి)

తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఢిల్లీలో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ, ఈ పొత్తు రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారి తీయడం ఖాయమని అన్నారు. పొత్తు నేపథ్యంలో జేడీఎస్ 4 నుంచి 6 లోక్‌సభ సీట్లు కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ 4 సీట్లను మాత్రమే ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. బీజేపీ, జేడీఎస్ పొత్తు ఊహించిందేనని, దీని ప్రభావం తమపై ఏమాత్రం ఉండబోదని, ప్రజలు తమ పక్షానే ఉన్నారని కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు.

# కమలంలో కలకలం!

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.విజయరామారావు, ఎం.రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్న ఈ సమావేశం పార్టీలో కలకలం సృష్టించింది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని భావిస్తున్న ఈ నేతలంతా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి గుడ్‌బై చెప్పే అవకాశం ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు పార్టీ ఏర్పాటైనప్పటి నుంచి ఉన్న సీనియర్ నేత, నగర పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, ఆయన భార్య బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మలు.. తాము పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసినా, తగిన గుర్తింపు లేదని పేర్కొంటూ బీజేపీకి రాజీనామా చేశారు. సుదీర్ఘకాలంగా పార్టీలో ఉన్నందున తమకు అంబర్‌పేట అసెంబ్లీ టికెట్ కేటాయించాలని కోరితే నాయకత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇటీవల భేటీ అయిన నేతల అసంతృప్తికి కారణాలు తెలుసుకుని వారిని బుజ్జగించే బాధ్యతను రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్‌కు నాయకత్వం అప్పగించినట్టు పార్టీవర్గాల సమాచారం. రాష్ట్ర పార్టీలో ముఖ్య నేతలుగా, జాతీయ కార్యవర్గ సభ్యులు, సీనియర్లుగా ఉన్నా తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించడం లేదనేది అసంతృప్త నేతల ప్రధాన ఫిర్యాదుగా ఉన్నట్టు సమాచారం. అలాగే పార్టీ తీరు, నాయకత్వం వ్యవహారశైలి పైనా వారు ఆగ్రహంతో ఉన్నారని, అధిష్టానం వైఖరి, ముఖ్యంగా పార్టీ అగ్రనేత అమిత్ షా అనుసరిస్తున్న తీరు సైతం సమావేశంలో చర్చకు వచ్చినట్టు చెబుతున్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా.. కేవలం రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌లతోనే అమిత్ షా సమావేశం కావడం, తమను దూరం పెట్టడంపై వీరంతా కినుక వహించినట్టు తెలుస్తోంది. మోదీ, అమిత్‌షా, నడ్డాలు రాష్ట్ర పర్యటనకు వచ్చినపుడు సైతం ఆయనకే గుర్తింపునివ్వడం, వేదికపైనా తమ పక్కన అవకాశం కల్పించడం వంటి వాటిపై కొందరు నేతలు గుర్రుగా ఉన్నట్టు సమాచారం.



గతంలో పార్టీ చేరికల కమిటీ చైర్మన్‌గా, ఇప్పుడు ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఈటల వ్యవహరిస్తున్న తీరుపై పలువురు నేతలు అసహనంతో ఉన్నట్టు చెబుతున్నారు. తమకు తెలియకుండా, కనీసం సంప్రదించకుండా తమ ప్రాబల్య ప్రాంతాలు, నియోజకవర్గాల్లో చేరికలను ఈటల ప్రోత్సహించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల తమను సంప్రదించకుండా సంగారెడ్డి, ములుగు జిల్లాల్లో కొందరిని చేర్చుకోవడంపై వారు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. మరోవైపు అసంతృప్త నేతల తీరుపై ఇతర నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీరు నిత్య అసంతృప్తులంటూ మండిపడుతున్నారు. తాము అనుకున్న స్థాయిలో సమన్వయంతో పని చేయడం లేదని, ఇలాగైతే తామే ఢిల్లీ నుంచి ఎన్నికల కార్యాచరణను అమలు చేయాల్సి ఉంటుందంటూ క్లాస్ తీసుకునేందుకే.. కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటలతో అమిత్ షా ప్రత్యేకంగా భేటీ అయ్యారని వారు వివరిస్తున్నారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను కూడా అమిత్‌షా పిలవలేదంటూ వారు గుర్తు చేస్తున్నారు.

**అధినేతల తీరుతో తప్పుడు సంకేతాలు!**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భారీ అవినీతి జరిగిందని, ఇది కేసీఆర్ సర్కార్‌కు, బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందంటూ విమర్శలు గుప్పించిన అమిత్ షా, నడ్డాలు.. ఇదిగో విచారణ, అదిగో విచారణ అంటూ తాత్సారం చేయడమే తప్ప ఎలాంటి చర్య తీసుకోకపోవడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇంకా అరెస్టు చేయకపోవడం వంటివి ప్రజల్లో తప్పుడు సంకేతాలకు కారణమౌతున్నాయని అసంతృప్త నేతలు అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. కీలక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని జరుగుతున్న ప్రచారాన్ని ఈ కారణంగా గట్టిగా తిప్పికొట్టలేకపోతున్నామని వారు పేర్కొంటున్నట్లు సమాచారం.

# 70 సీట్లలో వడపోత పూర్తి!



చేసినట్టు సమాచారం. ఇద్దరేసి పేర్లను ఎంపిక చేసిన నియోజకవర్గాలకు సంబంధించిన సర్వేల ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేసే అధికారాన్ని పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి అప్పగించినట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. మిగతా స్థానాల్లోనూ సర్వేల ప్రకారం పరిశీలన జరిపి షార్ట్ లిబస్ట్ చేయడం కొలిక్కి వచ్చిందని అంటున్నాయి.

**నిర్ణయాధికారం కేంద్ర కమిటీకే..**

అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన ఢిల్లీలో వరుసగా రెండోరోజూ నేతల భేటీ జరిగింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలుతోపాటు ఇతర సభ్యులు ఇందులో పాల్గొన్నారు. గురువారం భేటీలో 35 వరకు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన కమిటీ... శుక్రవారం ఐదు గంటల పాటు చర్చించి మరో 5 స్థానాల్లో అభ్యర్థులను ఫైనల్ చేయడంతోపాటు, ఇంకో 30 సీట్లకు వడపోత పూర్తి చేసింది. రాజకీయ, కుల సమీకరణాలు, ప్రజాక్షేత్రంలో బలాబలాలు, సర్వే నివేదికల ఆధారంగా ఈ 30 స్థానాల్లో ఇద్దరేసి నేతలను ఎంపిక చేసినట్టు తెలిసింది. ఈ లిస్టులో ఎల్‌బీనగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్, శేరిలింగంపల్లి, బోథ్, ఖానాపూర్, కరీంనగర్, డోర్నకల్, మహబూబాబాద్, పరకాల, జనగాం, వర్ధన్నపేట, వనపర్తి, నారాయణపేట, నకిరేకల్, తుంగతుర్తి, నర్సాపూర్, దుబ్బాక, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, మునుగోడు, సికింద్రాబాద్, హుస్నాబాద్ తదితర నియోజకవర్గాలు ఉన్నట్టు తెలిసింది. వీటికి ఎంపిక చేసిన ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరిని ఫైనల్ చేసే అధికారాన్ని కేంద్ర ఎన్నికల కమిటీకి అప్పగించాలని భేటీలో నిర్ణయించినట్టు సమాచారం. సునీల్ కనుగోలు బృందం చేసిన సర్వేలతోపాటు ఏఐసీసీ తరఫున చేయించిన ఇతర సర్వేల ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. మిగతా 50 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు కోసం కమిటీ మరోమారు భేటీ కానుందని అంటున్నాయి.

**రేవంత్‌ను కలసిన రేఖానాయక్, వేముల వీరేశం**

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నేపథ్యంలో ఢిల్లీలోనే తిష్టవేసిన ఆశావహులు ఏఐసీసీ, పీసీసీ నేతల ఇళ్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్ శుక్రవారం ఉదయం రేవంత్‌తో భేటీ అయ్యారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా రేవంత్‌ను కలిశారు. మరోవైపు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఢిల్లీకి వచ్చారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా ఢిల్లీలోనే ఉండటంతో షర్మిల పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు వాడీవేడిగా సాగినట్టు తెలిసింది. 40 స్థానాలు మినహా.. మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై నేతల మధ్య తీవ్రస్థాయిలో భేదాభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. కొన్ని స్థానాలపై చర్చ సమయంలో తీవ్ర స్థాయిలో వాదనలు చేసుకున్నట్టు తెలిసింది. 'అసలు కాంగ్రెస్, వలస నేతలు' అన్న ప్రాతిపదికన ఈ వాగ్వాదం జరిగిందని.. ఎన్నారైలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల పేర్లను సీఈసీకి పంపే విషయంలో నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. మెజార్టీ సభ్యులు ఒక్క పేరే సూచించిన పలు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థి ఎంపిక ఫైనల్ కాలేదని.. అలాంటి స్థానాలను ప్రస్తుతానికి పక్కనపెట్టాలని కొందరు నేతలు పట్టు బట్టినట్టు తెలిసింది. ఈ విషయంపై టీపీసీసీ ముఖ్య నేత ఒకరు మాట్లాడుతూ.. "ఈ సమావేశంలో ఏం జరిగిందని తెలుసు కున్న తర్వాత చాలా స్థానాపై ఏకాభిప్రాయం కుదిరే పరిస్థితే కనిపించడం లేదు. హైకమాండ్ కచ్చితంగా జోక్యం చేసుకోవాల్సిందే. చివరికి ఎవరి పేర్లు వాళ్లు పంపేలా ఉన్నారు. వచ్చే వారంలో జరిగే సమావేశంలో ఏం జరుగుతుందో చూద్దాం.." అని వ్యాఖ్యానించడం గమనార్హం.

# భవిష్యత్తుకు భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

రాజయ్య నడుమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సమక్షంలో రాజీ కుదిరింది. నర్సాపూర్ అభ్యర్థి ప్రకటనలో నెలకొన్న ప్రతిష్టంభనను కూడా రెండు మూడురోజుల్లో తొలగించేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారు. కల్వకుర్తి, పటాన్‌చెరు తదితర నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య అంతర్గత విభేదాలను పరిష్కరించడంపై కూడా కేటీఆర్ దృష్టి సారించారు. జనగామ, నర్సాపూర్‌తో పాటు నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లను మరో వారం రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

**ఆర్టీసీ చైర్మన్ పదవి కావాలన్న ముత్తిరెడ్డి?**

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, వెంకట్‌రాంరెడ్డి శుక్రవారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నివాసానికి వెళ్లారు. అంతా కలిసి ప్రగతిభవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ముత్తిరెడ్డికి టికెట్ నిరాకరణకు కారణాలను వివరించిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సహకరించి ఆయన గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం ఏదో ఒక ప్రాధాన్యత కలిగిన పదవి ఇవ్వడంతో పాటు, భవిష్యత్తులో ఎమ్మెల్సీగానూ అవకాశం కల్పిస్తానని హామీ ఇ చ్చినట్లు తెలిసింది. అయితే తనకు ఆర్టీసీ చైర్మన్ పదవి కావాలని ముత్తిరెడ్డి కోరగా ప్రస్తుతం ఎమ్మెల్సీ పల్లా నిర్వహిస్తున్న రైతుబంధు సమితి అధ్యక్ష పదవిని కేసీఆర్ ఆఫర్ చేసినట్లు సమాచారం. కాగా ముత్తిరెడ్డి బెట్టు వీడిన నేపథ్యంలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా పేరును కేసీఆర్ ఖరారు చేశారు.

**నర్సాపూర్, కల్వకుర్తిపై త్వరలో స్పష్టత**

నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటనలో నెలకొన్న ప్రతిష్టంభనపై బీఆర్ఎస్ అధినేత దృష్టి సారించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి కూడా టికెట్ కోసం పట్టుబడుతుండటంతో అభ్యర్థి ప్రకటనను పెండింగులో పెట్టారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ చేస్తానని మదన్‌రెడ్డి స్పష్టం చేస్తూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమ లేదా మంగళవారం అందుబాటులో ఉండాల్సిందిగా ఇద్దరు నేతలకు ప్రగతిభవన్ నుంచి సమాచారం వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే కల్వకుర్తి టికెట్‌ను ఆశించిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి కూడా శుక్రవారం ప్రగతిభవన్ నుంచి పిలుపు వెళ్లినట్లు తెలిసింది. కేసీఆర్ ఆదేశాల మేరకు కసిరెడ్డి ప్రగతిభవన్‌కు చేరుకున్నప్పటికీ సీఎం ఇతర సమావేశాలతో బిజీగా ఉండటంతో భేటీ వాయిదా పడింది. కసిరెడ్డికి ఒకటి రెండురోజుల్లోనే మరోమారు పిలుపు వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. తనను కల్వకుర్తి అభ్యర్థిగా ప్రకటించి, సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు తాను ఖాళీ చేసే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కసిరెడ్డి కోరుతున్నారు.

**వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానన్న రాజయ్య!**

స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ విషయంలో నెలకొన్న పంచాయితీ కూడా ప్రగతిభవన్ వేదికగా కొలిక్కి వ చ్చింది. ఎమ్మెల్సీ పల్లా శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను వెంటబెట్టుకుని కేటీఆర్ వద్దకు వెళ్లారు. సంప్రదింపులు, చర్చల అనంతరం కడియం శ్రీహరి అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు రాజయ్య ప్రకటించారు. కడియం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పదవిని రాజయ్యకు ఇస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే గతంలో శ్రీహరికి వరంగల్ ఎంపీగా అవకాశం ఇ చ్చినందున తనకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని రాజయ్య కోరినట్లు సమాచారం. వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తనకు లోక్‌సభకు పోటీ చేసే అవకాశమివ్వాలని రాజయ్య పట్టుబట్టినట్లు సమాచారం. అయితే కేటీఆర్ ఏదో ఒక చట్టసభలో క చ్చితంగా పదవి ఇస్తామని భరోసా ఇవ్వడంతో రాజయ్య అంగీకరించినట్లు తెలిసింది. కేటీఆర్‌తో భేటీ అనంతరం కడియం శ్రీహరి గెలుపు కోసం పనిచేస్తానంటూ రాజయ్య ప్రకటించారు. కాగా పార్టీ నిర్ణయం మేరకు తనకు మద్దతు ప్రకటించిన రాజయ్యకు కడియం ధన్యవాదాలు తెలిపారు.

# ఏయ్ ఉగ్రవాది..

**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు డానిష్ అలీ లేఖ బిధూడీని హెచ్చరించి వదిలిపెట్టిన సభాపతి**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: "ఏయ్ ఉగ్రవాది.. ముల్లా ఉగ్రవాది, భడ్వే (తార్పుడుగాడు), కట్వా (సున్తీ చేయించుకున్నవాడు).. ఈ ముల్లా ఉగ్రవాదిని బయటకు విసిరెయ్యండి" ..బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఎంపీ డానిష్ అలీని ఉద్దేశించి గురువారం రాత్రి లోక్‌సభ సాక్షిగా అధికార బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీ చేసిన దారుణ వ్యాఖ్యలివి. చంద్రయాన్-3 విజయంపై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన డానిష్ అలీ.. బిధూడీ వ్యాఖ్యలను సభా హక్కుల కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. బిధూడీ తనపై చేసిన వ్యాఖ్యలను అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించారు. కొత్త పార్లమెంటు భవనంలో జరిగిన ఈ ఘటన తన హృదయాన్ని ముక్కలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికైన సభ్యులను సభలో ఇలాంటి అవమానించడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఆరెస్సెస్ నిర్వహించే శాఖల్లో నేర్పించేది ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నవభారత ప్రయోగశాలలో బీజేపీ శ్రేణులకు నేర్పిస్తున్నది ఇదేనా? అని నిలదీశారు. బిధూడీపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోతే పార్లమెంటు సభ్యత్వాన్ని వదులుకునే అంశాన్ని పరిగణిస్తున్నానని పేర్కొన్నారు. ఇక.. రమేశ్ బిధూడీ వ్యాఖ్యలపై ఓం బిర్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి జరిగితే కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జరిగిన ఘటన విపక్షాన్ని బాధించి ఉంటే అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని.. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కాగా.. బిధూడీ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో సభాపతిగా వ్యవహరించిన కాంగ్రెస్ నేత కొడికున్నిల్ సురేశ్.. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాల్సిందిగా అధికారులకు సూచించారు. మరోవైపు.. సభలో వాడిన అభ్యంతరకరపదజాలంపై బిధూడీకి బీజేపీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సభలో ఆయన అన్‌పార్లమెంటరీ భాష వాడినందుకు క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తమ పార్టీ ఎంపీపై దారుణమైన వ్యాఖ్యలు చేసిన రమేశ్ బిధూడీపై బీజేపీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దురదృష్టకరమని బీఎస్పీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యానించారు. రమేశ్ బిధూడీ వ్యవహారంపై రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేయడాన్ని కంటితుడుపుచర్యగా.. కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ అభివర్ణించారు. "బిధూడీ వ్యాఖ్యలు పూర్తిగా సిగ్గుచేటు. ఆయన ఉపయోగించన భాష పార్లమెంటుకే కాదు.. ప్రతి భారతీయుడికీ అవమానకరం" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బిధూడీని ఇంకా సస్పెండ్ చేయకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిధూడీని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. బిధూడీ వ్యాఖ్యల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ.. "బీజేపీ ఢిల్లీ ఎంపీ.. ఒక ముస్లిం ఎంపీపై స్పీకర్ సాక్షిగా పార్లమెంటులో ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఇదేనా బీజేపీ సంస్కృతి?" అని మండిపడింది. ఆర్జేడీ నేత లాలూప్రసాద్ యాదవ్ సహా.. ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీల నేతలు బిధూడీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

# ఓబీసీలపై కాంగ్రెస్ సవతి ప్రేమ

(మొదటి పేజీ తరువాయి)


సంతుష్టికరణ, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ట్రిపుల్ తలాక్ వంటి అంశాలను లేవనెత్తుతూ ఉంటుంది' అని నడ్డా అన్నారు.

**రాజకీయ లబ్ధి కోసం కాదు**

మహిళా బిల్లును తక్షణం అమల్లోకి తేవాలన్న విపక్షాల డిమాండ్‌ను నడ్డా తోసిపుచ్చారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం నడచుకుంటుందన్నారు. మహిళా బిల్లు ద్వారా లబ్ధి పొందడం బీజేపీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ఈ బిల్లు విషయంలో ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్నదే సరైన, అత్యంత దగ్గర విధానమని చెప్పారు. అంతకుముందు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘావల్ మహిళా బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దానికి సభ ఆమోదం లాంఛనమేమని భావి స్తున్నారు. అనంతరం మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత జన గణన గణాంకాల ఆధారంగా జరిపే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.

**వాగ్వాదం**

రాజ్యసభలో మహిళా బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, జేపీ నడ్డా మధ్య వా గ్వాదం వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. బిల్లు అమలు కాలావధిపై విపక్షాల విమర్శలను నడ్డా విమర్శించడం ఇందుకు దారితీసింది. ఖర్గే జోక్యం చేసుకుంటూ, బీజేపీకి దమ్ముంటే రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని సవాలు చేశారు.



# చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల టౌన్ పోలీస్ సూచన**



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జగిత్యాల పట్టణ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం నాడు జగిత్యాల పట్టణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసే సూచనలు జారీ చేశారు. ఇటీవల కాలంలో పలు ప్రాంతాలలో దొంగతనాలు జరిగాయని, గుర్తు తెలియని దొంగలు దొంగతనాలు చేసేవారు ఎక్కువగా సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇంటికి తాళం వేసి దూర ప్రయాణాలు చేసినప్పుడు తమ ఆస్తులను కాపాడుకునేందుకు పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని తెలిపారు. బ్యాంకులో డబ్బులు డ్రా చేసి తీసుకెళ్లే సమయంలో అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. తమ వద్ద ఉన్న డబ్బులను బైక్ ముందు ప్యాకెట్ లేదా డిక్కీలో పెట్టినప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.ఇండ్ల ముందు సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా దొంగతనలను నివారించవచ్చని, అందరూ తమ ఇంటి చుట్టూ సీసీ కెమెరాలకు అమర్చుకోవాలని తెలిపారు.

ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా 100 డయల్ కి కాల్ చేయాలని పేర్కొన్నారు.సైకిళ్ళ సైడ్ బాక్స్ లలో మరియు బండి కవర్లలో స్కూటీ డిక్కీలలో పెట్టినటువంటి డబ్బులు కానీ నగలు కానీ ఇతర విలువైన వస్తువులు కానీ దొంగిలించుకొని వెళ్తున్నారని, బండి బ్యాగులో లేదా సైడ్ బాక్స్ లల్లో నగలు లేదా నగదు పెట్టి లాక్ వేసినప్పటికీ కూడా దొంగలు అట్టి వాటిని గమనించి దగ్గర ఉన్న పనిముట్లు ఉపయోగించి లోపల పెట్టుకున్న నగదు దొంగిలిస్తున్నారని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జాగ్రత్తగా ఉండగలరని, ఎలాంటి నగలు, నగదు అయిన కూడా మీ వెంటే తీసుకొని జాగ్రత్తగా పట్టుకొని వెళ్లగలరని సూచించారు. మీ విలువైన వస్తువులు, నగదు వాహన డిక్కీలలో గాని సైడ్ బాక్సులలో గాని పెట్టి వాహనాలను ఎక్కడా కూడా పార్కింగ్ చేయరాదన్నారు. తమ నగలు నగదు విషయంలో ప్రజలు ఏమరపాటు ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీకి గురి కాకుండా కాపాడుకోవచ్చని జగిత్యాల పట్టణ పోలీసులు సూచించారు



## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ..

జగిత్యాల టౌన్/ **సమ సమాజం:**పద్మనాయక వెల్మ సంక్షేమండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘననాథుని వద్ద శుక్రవారంనాడు కుంకుమ పూజ ను వైభవంగా నిర్వహించారు. శ్రీమాన్ నంది వేణుగోపాలచార్య కౌశిక ఆధ్వర్యంలో కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాచమనేని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దన్నపనేని వేణుగోపాలరావు, కోశాధికారి మెన్నేని దామోదర్ రావు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రావు, సాగర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటేశ్వరరావు శ్రావణ్ రావు, కార్యవర్గ సభ్యులు సురేందర్రావు కిరణ్ రావు, అజిత్ రావు, మెన్నేని సురేందర్ రావు, శిరీష , బోయిన్పల్లి హరిప్రియ, గంద్ర రాధిక, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాదాడి సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సంతోష్ రావు, కోశాధికారి ఆనందరావు, తోపాటు రమేష్ రావు, సునీల్ రావు, మెన్నేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు సునీల్ రావు తదితరులతో పాటు పద్మనాయక మండల సభ్యులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిభిరం.

**జగిత్యాల, సమ సమాజం:** భవన నిర్మాణ కార్మికులకు జిల్లా కార్మిక శాఖా,కామన్ సర్వీస్ సెంటర్ వారు వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, క్యాంప్ కో ఆర్డినేటర్ ఎండీ రఫీతెలిపారు.ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎనగందుల గంగయ్య మాట్లాడు తూ భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు.కార్మికులు వైద్య శిభిరం లో పరీక్షలు చేయించుకొని ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా కార్మికులు ఉండాలని తెలిపారు. ఈవైద్య శిభిరం లో సుమారు 80 మంది భవన నిర్మాణ రంగం కార్మికులు ఉచిత రక్త పరీక్షలు చేయించుకున్నట్లు వివరించారు.వారం రోజుల్లో రిపోర్టు వచ్చిన తర్వాత పోస్ట్ క్యాంపు నిర్వహించి డాక్టర్ సలహాలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెరుగు కొమురయ్య,ఉప సర్పంచ్ పుధరి రాజేంధర్, ఎంపీటీసీ సప్ప జ్యోతి, భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షుడు



ఎనగందుల గంగయ్య, మండల అధ్యక్షులు తారల చంద్రయ్య, ఉపాధ్యక్షులు దాంకా నర్సయ్య, ప్రదాన కార్యదర్శి బండారి సత్యనారాయణ, కార్యదర్శి సిరిపురం రాజేశం, మోకెనపల్లి శ్రీనివాస్, కాశ హన్మండ్లు, బతిని శ్రీనివాస్, కాశ నందయ్య, మోకెనపల్లి శంకరయ్య, మోకెనపల్లి బాపు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పై దాడిని ఖండిస్తున్నాం.

**రైతు జనసమితి రాష్ట్ర అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి**



**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో గత బుధవారం జర్నలిస్టు చుక్క గంగారెడ్డి పై జరిగిన భౌతిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రైతు జనసమితి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ జనసమితి కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన బృందంతో కలిసి బుగ్గారంలోని సీనియర్ జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి ని పరామర్శించారు. గత బుధవారం గంగారెడ్డి పై జరిగిన భౌతిక దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు గ్రామస్తులతో ఆయన విచారణ జరిపారు. అనంతరం బస్టాండ్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం దగ్గర విలేఖరులతో మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి పై జరిగిన దాడిపై పోలీస్ అధికారులు వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులైన సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ గౌడ్, అతని అనుచరుడు గంగారాజం లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేండ్లు గా న్యాయ పోరాటం జరుగుతున్న బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై ఉన్నతాధికారులతో పాటు, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రతేక శ్రద్ధతో "శ్వేత పత్రం" విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, యువజన సమితి జిల్లా అధ్యక్షులు కంతి రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి తరుణ్, నాయకులు అంతడుపుల గంగారాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ లో అవినీతి, అక్రమాలు ఆగేదెన్నడు..?


**▸▸పారిశుద్ధ్యం సక్రమంగా లేక జ్వరాల బారిన ప్రజలు ▸▸ మున్సిపల్ అత్యవసర సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ధ్వజం**

**జగిత్యాల, సమ సమాజం:**జగిత్యాల ప్రజలు ఇంటి పన్ను ద్వారా చెల్లించిన ఆదాయం నుండి రూ. 24 లక్షలు దశాబ్ది ఉత్సవాలకు చేసిన ఖర్చును బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు చైర్మన్ ,కమిషనర్ ను నిలదీశారు. జగిత్యాల పట్టణంలో సానిటేషన్ సరిగాలేనందున డెంగ్యూతో ప్రతి ఇంటిలో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారని వారు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన అత్యవసర సమావేశం చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన జరుగగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్,స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ లు హాజరయ్యారు.

**కౌన్సిల్ ఎదుట పలు అంశాలను లేవనెత్తారు.**

జగిత్యాల మున్సిపాలిటి ఈ రోజు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమావేశానికి గౌరవ సభ్యులందరు కావాలని కోరుతూ నిన్న రాత్రి ఎజెండా అంశములు కాపీని పంపించారని, కానీ ఎజెండాలో 17 అంశాలు పొందుపరిచారని అన్నారు. జగిత్యాల మున్సిపాలిటి యందు వివిధ శాఖలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం, ప్రజలను ఇబ్బందులు పాలు చేసే పనితీరుపై సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ రోజు ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశం అంటే ఏమిటి..? సాధారణ సమావేశం అంటే ఏమిటి..? ఈ సమావేశాలు ఏ సందర్భములో నిర్ణయిస్తారో చైర్ పర్సన్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

స్వీపింగ్ మిషన్ రూ. 44 లక్షలకు కొనుగోలు చేసినప్పటినుండీ నిరుపయోగంగా ఉన్నా, దాని పేరుమీద చూపే ఖర్చులు సానిటేషన్ అధికారులకు, ఇంజనీర్ అధికారులకు కల్పతరువుగా మారిందన్నారు. డీజిల్ లో విచారణ జరిగినప్పటికి అవినీతి మాత్రం మళ్ళీ ప్రారంభమైనదన్నారు. డీజిల్ లో జరిగే అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, ప్రజాధనం రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. సానిటేషన్ విభాగం నందు వాహనాల మరమ్మత్తులలో మాయాజాలం సృష్టిస్తూ నామమాత్రపు రిపేర్లు జరిపి, వేలాది రూపాయలు ఖర్చు చేసినట్లుగా చూపుతున్నారన్నారు. దీనికి ఒక ప్రత్యేకమైన మెకానిక్ ఉన్నప్పటికిని రిపేర్ల పేరు మీద సానిటేషన్ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇందులో ఎలాంటి అనుభవం లేని సానిటేషన్ అధికారులచే రిపేర్లు చేయించడం దారుణమని, పూర్తి అవగాహన ఉన్న ఇంజనీరింగ్ శాఖ నుండి ఒక టెక్నికల్ అధికారిని నియమించి అవినీతి జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జగిత్యాల పట్టణంలో సానిటేషన్ అటకెక్కిందని, కేవలం ప్రధాన రహదారులు మాత్రమే సానిటేషన్ చేయడం, జగిత్యాల పట్టణంలో వివిధ వార్డులలోని వీధులను సరిగా సానిటేషన్ చేయడం లేదన్నారు. ఏ వార్డుకు వెళ్ళినా ప్రజలే చెబుతారని, జగిత్యాల పట్టణంలో నూతనంగా గృహాలు నిర్మించుకునే వారికి గృహనిర్మాణ అనుమతుల కొరకు వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమని అన్నారు. ప్రభుత్వం ఆన్లైన్ విధానం పెడితే జగిత్యాల మున్సిపాలిటిలో మధ్యవర్తులను కలుపనిదే పర్మిషన్ రాదని అనేక దినపత్రికలు ఘోషిస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యవహారాలపై అవసరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని



సత్యమేవ జయతే 9908289899
జగిత్యాల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు
ఇందిరా భవన్, అశోక్ నగర్, జగిత్యాల - 505327

తేది : 22-09-2023

**పత్రిక ప్రకటన**


సాధారణ సమావేశం-అత్యవసర సమావేశం అంటే ఏమిటి ? సానిటేషన్‌లో అవినీతి, అక్రమాలు ఆగేదెన్నడు.
జగిత్యాల ప్రజలు ఇంటిపన్ను ద్వారా చెల్లించిన ఆదాయం నుండి 24లక్షలు దశాబ్ది ఉత్సవాలకు చేసిన ఖర్చు బహిర్గతం చేయాలి.
జగిత్యాల పట్టణంలో సానిటేషన్ సరిగాలేనందున డెంగ్యూతో ప్రతి ఇంటిలో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు.

[illegible]

కల్లెపెల్లి దుర్గయ్య, కాంగ్రెస్‌పార్టీ ఫ్లోర్ లీడర్, 30వ వార్డు కౌన్సిలర్
పర్వీన్‌సుల్తానా, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 42వ వార్డు కౌన్సిలర్
నక్క జీవన్ కుమార్, 12వ వార్డు కౌన్సిలర్
ఆసియా సుల్తానా, 13వ వార్డు కౌన్సిలర్
సహారాబాను, 31వ వార్డు కౌన్సిలర్
ములస్తం లలిత, 46వ వార్డు కౌన్సిలర్

కోరారు. ఈ సమావేశంలో 30వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లేపల్లి దుర్గయ్య, 42వ వార్డు కౌన్సిలర్ , కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఫర్విన్ సుల్తానా, 12వ వార్డు కౌన్సిలర్ నక్క జీవన్ కుమార్, 13వ వార్డు కౌన్సిలర్ ఆసియా సుల్తానా, 31 వ వార్డు కౌన్సిలర్ సహారాబాను, 46వ వార్డు కౌన్సిలర్ ములస్తం లలితతో స్వతంత్ర కౌన్సిలర్ హనుమ%శీ%డ్ల జయశ్రీ తో పాటు బారాస, బీజేపీ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## 20 కోట్ల భారీ నిధులతో అభివృద్ధి పనులకు మంత్రి కొప్పుల ప్రత్యేక చొరవ



PLANNING (VI) DEPARTMENT

**Memo No.2361/Plg.VI/SDF/2023** **Dated:22-09-2023**

Sub:- Special Development Fund – Approved list of (03) works with an estimated cost of Rs.2000.00 lakh to be taken up in Dharmapuri AC covering in Jagtial and Peddapally Districts under SDF 2023-24 - Communicated - Regarding.

Ref:- 1. G.O.Rt.No.365 Planning (VI) Department dated:02.09.2023.
2. Letter No.Plg/151/SDF/dmpr/2023-24, dt.13.09.2023 from the District Collector, Peddapalli.
3. Letter No.Plg./44/SDF 2023-24/DPuri A.C/2023, dt.14.09.2023 from the District Collector, Jagitial.

* * *

The attention of the District Collectors, Peddapalli and Jagtial are invited to the references cited and it is to inform that the Government vide reference 1st cited have accorded Administrative sanction for an amount of Rs.20.00 crore for taking up certain (R&B) Road works in Dharmapuri Assembly Constituency covering in Jagitiaal and Peddapalli Districts under the Scheme Special Development Fund for Welfare and Development Activities for the year 2023-24.

2. In the references 2nd & 3rd cited, the District Collectors, Peddapalli and Jagtial while furnishing the category wise list of (03) works with an estimated cost of Rs.2000.00 lakh to be taken up in Dharmapuri AC covering in Peddapally and Jagtial Districts have requested to sanction the same for execution of proposed works. The category wise list of works furnished by the District Collectors are as follows:

| Sl. No | Assembly Constituency | District | Name of the work | Est.Cost Rs.in Lakh | Cate gory |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 5 | 6 | 7 |
| 1 | Dharmapuri | Peddapalli | Widening and strenthening of Rayapatnam to Kodada road from 18/0 – 20/4 (Four lane road) including Drains and Divider in Dharmaram Mandal, Peddapalli District (BY HMP) | 1450.00 | SC |
| 2 | | Jagitial | Junction Development at km 0/0 of Rayapatnam-Kodada road in Jagitial District (By HMP) | 350.00 | Gen |
| 3 | | Jagitial | Junction Development at Rajarampalli Chowrasta in km 17/1 onRayapatnam-Kodada road including SRSP Canal bridge widening in Jagitial District (By HMP) | 200.00 | Gen |
| | | | Total | 2000.00 | |

3. In this connection, it is to inform that the list of above (03) works with an estimated cost of Rs.2000.00 lakh furnished vide references 2nd & 3rd cited are approved. Further, the District Collectors Peddapalli and Jagtial shall arrange to ground the works through Executive agency concerned after receipt of the work wise detailed estimates and technical sanctions not exceeding the amount sanctioned, strictly following the departmental guidelines in vogue. The sanctioned works shall be executed by the departments concerned expeditiously, duly ensuring necessary quality control checks as per the departmental norms. They shall also ensure that the works now sanctioned were not taken up previously under any other scheme. The funds will be released depending on progress of works.

K.RAMAKRISHNA RAO
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT (FAC)

To
The District Collector, Peddapalli.
The District Collector, Jagitial.
The Chief Planning Officer, Peddapalli District
The Chief Planning Officer, jagitial District
**Copy to**
The Accountant General, Telangana, Hyderabad.
The Secretary (SS) to C.M. for information.
The Secretary, R&B Dept.
SC

//FORWARDED BY ORDER//

ASSISTANT DIRECTOR

**జగిత్యాల,సమ సమాజం:** జగిత్యాల, పెద్దపల్లి జిల్లా ల ను కవర్ చేస్తూ ధర్మపురి నియోజకవర్గంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో జి .ఓ:365 ప్లానింగ్ (%ఎ×%) విభాగంలో స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ 2023 –24 నిధుల క్రింద 03 పనుల గాను రూ.20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి.జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద జంక్షన్ కోదాడ రహదారి (కూడలి) అభివృద్ధి మరియు విస్తరణ కోసం రూ 3 కోట్ల 50 లక్షలు,జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి చౌరస్తా వద్ద జంక్షన్ విస్తరణ లో భాగంగా అభివృద్ధి కోసం రూ 2 కోట్లు,పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఫోర్ లైన్, డివైడర్ మరియు డ్రైనేజీ నిర్మాణానికి రూ 14 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# షార్ట్ సర్క్యూట్ తో గుడిసె దగ్ధం

**జగిత్యాల, సమ సమాజం:** పట్టణంలోని నిజామాబాద్ రోడ్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలతో గుడిసె కాలిపోయింది. ఈ ప్రమాదంలో నిత్యవసర సరుకులతో పాటు దుప్పట్లు దుస్తులు కాలిపోయాయి. మేకల కావేరి చెందిన ఈ గుడిసెలో ఆమె తో పాటు ఇద్దరు పిల్లలతో నివసిస్తుండగా వారు గుడిసేలో లేని సమయంలో చెలరేగిన మంటల వల్ల కాలిపోయిన ఘటనతో ప్రాణ నష్ట ప్రమాదం తప్పిన్నట్లయింది. కాగా నిత్యవసర సరుకులతో పాటు దుప్పట్లు, దుస్తులు ఇతర సామాగ్రి, నిత్యావసర వస్తువులు కాలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తుంది.



# కేంద్ర పాలిత ప్రాంతంగా హైదరాబాద్ ? కేంద్ర ప్రభుత్వం త్వరలో కీలక ప్రకటన

**సమ సమాజం:** తెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్ త్వరలో కేంద్ర పాలిత కేంద్రం కానుందా..? హైదరాబాద్‌ను యూటీ ( యూనియన్ టెరిటరీ) గా చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందా..? హైదారబాద్ యూటీకి సంబంధించి త్వరలో కీలక ప్రకటన రానుందా..? అంటే అవుననే అనుమానాలే వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం గల్లీ నుంచి ఢిల్లీ వరకు సోషల్ మీడియాలో జరుగుతున్న విస్తృతమైన ప్రచారం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. హైదరాబాద్‌ను యూటీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దీనికి సంబంధించి వివిధ శాఖల అధికారులు, రక్షణ విభాగాల ప్రతినిధులతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రహస్యంగా చర్చలు జరుపుతున్నారని వస్తున్న వార్తలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టుగా తెలంగాణపై అత్యధిక ఫోకస్ పెట్టిన బీజేపీ పెద్దలు హైదరాబాద్ విషయంలోనూ సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు కూడా అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికే ఆయువుపట్టులా ఉండే హైదరాబాద్ నగరం తమ ప్రత్యక్ష పర్యవేక్షణలోకి తెచ్చుకోవటం ద్వారా ఒక్క దెబ్బకు అనేక పిట్టలు అన్న వ్యూహాన్ని కమలనాథులు అమలు చేయబోతున్నారనే టాక్ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ నుంచి వస్తున్న లీకులను హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న ప్రచారం రాజకీయ కాక రాజేస్తోంది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే హైదరాబాద్‌ను యూటీ చేయాలని సీమాంధ్ర నాయకులు డిమాండ్ చేశారు. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోని ఆనాటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని పదేళ్ళ పాటు ఉమ్మడి రాజధానిగా చేసింది.

ఈ గడువు మరో ఏడాదిలో అంటే 2024 జూన్‌తో ముగిసి పోనుంది. సరిగ్గా ఈ సమయంలోనే హైదరాబాద్‌ను యూనియన్ టెరిటరీగా ప్రకటిస్తారు అనే ప్రచారం తెరపైకి రావటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవంగా హైదరాబాద్ ను యూనియన్ టెరిటరీగా ప్రకటిస్తే ప్రధాని మోడీ సర్కార్‌కు, భారతీయ జనతా పార్టీకి అత్యంత ప్రయోజనం చేకూర్చే అంశంగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ఏపీలో ఉనికి కోసం పోరాడుతున్న బీజేపీ తెలంగాణలో మాత్రం ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోంది.

హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తే హెచ్ఎండిఏ పరిధిలోని మొత్తం భాగ్యనగరం అంతా కేంద్రం అజమాయిషీ లోకి వెళ్ళిపోతుంది. దీంతో ఇక్కడ అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టు అవుతుంది. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లా భావించే భాగ్యనగారాన్ని కేంద్రంగా చేసుకునే రాజకీయ పార్టీలన్నీ మనుగడ సాగిస్తున్నాయి. అలాగే తెలంగాణ ఆదాయంలో సింహభాగం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఈ ఆదాయాన్ని ఆధారంగా చేసుకునే తెలంగాణ సీఎం ముఖ్యమంత్రి దళిత బంధు, రైతు బంధు అంటూ అనేక పిల్లి మొగ్గలు వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కనుక హైదరాబాద్‌ను యూటీ చేస్తే హైదరాబాద్ ఆదాయం కేంద్ర ఖజానాకు జమ కానుంది. ఇదే కనుక జరిగితే కేసీఆర్ కుప్పి గంతులకు శాస్వతంగా చెక్ పెట్టినట్టు అవుతుందని, బీజేపీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. ఇక హైదరాబాద్ యూటీ అంటే ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకత వచ్చినా హైదరాబాదీయులు మాత్రం స్వాగతిస్తారనే అభిప్రాయం ఉంది. ఎందుకంటే చాలా వస్తువులపై పన్నులు తగ్గటం, జీవన ప్రమాణాలు పెరగటం, దేశ రాజధాని ఢిల్లీ తరహా అభివృద్ధి సాధ్యమవ్వటం వంటి అనేక అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయని అంటున్నారు. అంతే కాదు రక్షణ పరంగా అత్యంత వ్యూహాత్మక ప్రాంతం కావటంతో హైదరాబాద్ ను యూటీ చేయటం అనే ప్రతిపాదన ఏనాటి నుంచో ఉంది. దేశ రక్షణ ప్రయోజనాల కోసమే హైదరాబాద్‌ను యూటీ చేస్తున్నామని కేంద్రం చెబితే అభ్యంతరం వ్యక్తం చేసే వారుండరు. ఎందుకంటే ఇక్కడ అనేక రక్షణ సంస్థలు ఉన్నాయి. రెండు మిలటరీ కంటోన్మెంట్‌లు, ఆయుధ తయారీ కేంద్రాలు అనేకం ఉన్నాయి. కాబట్టి హైదరాబాద్ యూటీపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. అంగీకరించటం తప్ప ఇతర పార్టీలకు మరో ప్రత్యామ్నాయం ఉండదని రాజకీయ పరిశీలకుల అభిప్రాయంగా ఉంది. అన్నింటికన్నా మరో ముఖ్య విషయం ఏంటంటే.. ఎంఐఎం ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరం మరింత సెన్సిటివ్ గా మారింది. పాతబస్తీని అడ్డాగా చేసుకుని ఆ పార్టీ మతపరంగా సమాంతర వ్యవస్థ నడుపుతోంది. ఒకవేళ హైదరాబాద్‌ను యూటీ చేస్తే ఎంఐఎం కార్యకలాపాలకు పూర్తిగా బ్రేక్ పడుతుంది. కేంద్రం ప్రత్యక్ష అజమాయిషీ ఉండటంతో భాగ్యనగరంలో ఎంఐఎం ఆటలు సాగబోవని అంటున్నారు. ఇలా ఏ విధంగా చూసినా హైదరాబాద్ యూటీ అంశం అత్యంత కీలకంగా మారనుందనే అభిప్రాయమే సర్వత్రా వ్యక్తం అవుతోంది.

కేంద్ర పార్లమెంట్ సమావేశాల అనంతరం చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యార్థి యువజనులకు ఓటు చైతన్య సదస్సు నిర్వహించిన బహుజన యువగలం వేదిక నాయకులు చెరుకూరి రాజన్న

### ప్రజాస్వామ్య గణతంత్ర దేశంలో ఓటు పాత్ర చాలా కీలకం

**సమ సమాజం: ఇబ్రహీంపట్నం:** ఈ రోజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో బహుజన యువ గళం పేరిట నిర్వహించిన ఓటు చైతన్య సదస్సుతోపాటు విద్యార్థుల కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం చాలా పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన యువగలం వేదిక ఫౌండర్ చెరుకూరి రాజన్న మాట్లాడుతూ ఓటు హక్కు కోసం ఈ దేశంలో ఒక వర్గం వారికే ఉండాలని ఒక వర్గ జాతి నాయకులు, ఓటు 18 సంవత్సరాలు నిండిన కుల మత ప్రాంతీయ విభేదాలు లేకుండా ఆడ మగ అనే లింగ వివక్ష లేకుండా ఈ దేశంలో అందరికీ ఓటు హక్కు ఉండాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దిశ నిర్దేశాన్ని ఇస్తూ ఇటు భారత జాతీయ నాయకత్వాన్ని అటు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఓటును చాలా పవిత్రంగా భావించి బహుజన మహనీయులు కోరుకున్న నూతన సమాజాన్ని స్థాపించడం కోసం ఉపయోగపడే నిఖార్సయిన నిజమైన,నాయకున్ని నిజాయితీగా ఎన్నుకోవడంలో విద్యార్థులది యువకులది కీలకమైన పాత్ర అందుకు నిమిత్తం విద్యార్థులు యువకులు ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచన చేసి వేయాలి. అదే విధంగా విద్యార్థులు మంచి చదువులు చదివి తమ లాక్ష్యాలను, తమ తల్లిదండ్రులను ఆశయాలను, సాదించేందుకు నిరంతరం శ్రమించి తమ కలలను సహకారం చేసుకోవాలి అని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఈ బహుజన యువగలం తెలంగాణ రాష్ట్ర నలుమూలల వ్యాపింప చేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి పక్షాన,ప్రతి నిరుద్యోగి పక్షాన,ప్రతి ఒక్క ఉద్యోగ సమస్యల పట్ల ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాల పక్షాన ఈ బహుజన యువగలం గళం విప్పుతూనే ఉంటుంది అని అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునివ్వడం జరిగింది. బహుజన యువగళం ప్రజల సమస్యలను తెలుసుకుని కొన్ని తీర్మానాలు చేయడం జరిగింది.

1,ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజ్ మరియు ఇంజినీరింగ్ కాలేజి తక్షణమే



మంజూరు చేయాలి.

2.నాలుగు మండలాలకు సంబంధించినటువంటి విద్యార్థులకు ఒక సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి.

3. దూర ప్రాంతం నుంచి కాలేజికి వస్తున్నటువంటి ఈ విద్యార్థులకు ఉదయం సాయంత్రం వాళ్లకి అనుకూలంగా బస్సులను ఏర్పాటు చేయాలి . ఈ కార్యక్రమంలో బహుజన యువ గళం అధ్యక్షుడు జంగిలి ప్రశాంత్,అడ్వకేట్ సతీష్,నాయకులు వెంకట్ ముదికొండ, రాజేష్, చిరు భరత్,కళ్యాణ్,జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాకు జి.వో.317తో ఉమ్మడి మహబూబ్ నగర్నుండి వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి పంపాలి - BTF రాష్ట్ర నాయకులు యాదగిరి డిమాండ్



**సమ సమాజం:** ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి బిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ యాదగిరి మాట్లాడుతూ జి.వో.317 అమలులో బాగంగా ప్రస్తుత రంగారెడ్డి జిల్లాకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పది మండలాలకు కేటాయించిన క్యాడర్ స్ట్రెంత్ కు మించి వివిధ రకాల అప్పీల్స్ ద్వార ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సీనియారిటీ లిస్టులో అన్యాయం జరిగిందని కోర్టు అనుమతితో కొంత మంది ఉపాధ్యాయులు రావడం,మెడికల్ గ్రౌండ్స్ మరియు అంతర్ జిల్లా బదిలీల ద్వారా, స్పౌజు కేసు ద్వార, రాజకీయ పలుకబడితో తెలంగాణ రాష్ట్రం లోని ఇతర జిల్లాల నుండి అనేక మంది ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లాకు రావడం వలన స్థానిక ఉపాధ్యాయులకు బదిలీలు,ప్రమోషన్లలో తీరని అన్యాయం జరుగుతుంది. అదే విధంగా ఈ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలలో కూడా నష్టం జరుగుతుంది. రంగారెడ్డి జిల్లాలో పుట్టి పెరిగిన ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా,బలవంతంగా వికారాబాద్ జిల్లాకు కేటాయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 317 జీవో అమలులో భాగంగా స్థానికత విస్మరించి కేవలము సీనియారిటీ ప్రతిపాదికన ఉద్యోగ ఉపాధ్యాయుల విభజన చేస్తూ స్థానిక ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తూ తడిగుడ్డతో గొంతు కోసే కార్యక్రమానికి తెరలేపింది. 317 జీవో వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులలో చెలరేగిన మంటలు ఇప్పటికీ ఆరలేదు. 1975లో రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా ఉద్యోగ ఉపాధ్యాయులను లోకల్ క్యాడరైజేషన్ చేస్తూ అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్థానికత ఆధారంగా ఆనాటి ఉద్యోగ ఉపాధ్యాయులను ర్యాటిఫై చేసి తిరిగి వారు పనిచేస్తున్న స్థానాలలోనే రిటైయిన్ చేశారు ఏ ఒక్క ఉపాధ్యాయుని కదిలించే ప్రయత్నం చేయలేదు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడా స్థానికత ఆధారంగా విభజన చేసి ఉంటే ఏ ఒక్క ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా ఉండేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా హైదరాబాద్ చుట్టూ రంగారెడ్డి జిల్లా ఉండటం వలన అనేకమంది ఉద్యోగ ఉపాధ్యాయులు అక్రమంగా జిల్లాకు బదిలీపై వచ్చేవారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా హైదరాబాద్ చుట్టుపక్కల రంగారెడ్డి జిల్లా ఉండడం వలన అనేకమంది ఉద్యోగ ,ఉపాధ్యాయులుఅక్రమంగా రంగారెడ్డి జిల్లాకు పైరవీలు చేసుకుంటూ బదిలీలపై రావడం జరుగుతోంది. కాబట్టి ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో క్యాడర్ స్ట్రెంతుకు మించి తిష్ట వేసిన స్థానికేతరులను గుర్తించి 610 జీవో ఆధారంగా తిరిగి వారి సొంత జిల్లాకు పంపి రంగారెడ్డి జిల్లా స్థానిక ఉద్యోగ ఉపాధ్యాయులకు మరియు నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కే.శ్రీకాంత్,జమీర్, జావేద్, వెంకటేష్, ఫ్రాన్సిస్ గారు, తపస్ యు.నరసింహ,విక్రమ్ కుమార్, సంజీవరెడ్డి, వానాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దళిత ఆదివాసీ అంగన్ వాడి ఉద్యోగులపైదౌర్జన్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

### కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**సమ సమాజం:** ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసి దళిత మహిళ అంగన్వాడి ఉద్యోగుల పైన పోలీసులు దౌర్జన్యం చేసి కులం పేరు తో దూశించి,కొట్టి గాయపరిచిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది .కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు లు మాట్లాడుతూ అంగన్వాడీ ఆదివాసి, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్ఐ, సీఐ, డీఎస్పీ తదితరుల పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులే దాడి చేసి పైగా పోలీసులను అంగన్వాడి ఉద్యోగులే కొట్టినట్లుగా అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. తక్షణమే ఆదివాసి దళిత అంగన్వాడి ఉద్యోగులపై దాడులు ఆపాలని పెట్టిన కేసులు ఎత్తివేయాలని వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాపితంగా అంగన్ వాడి మహిళలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటానికి కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు తెలిపింది. అంగన్ వాడీలపై పోలీసు దౌర్జన్యాలను ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

## బెదిరింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్యే కంచర్ల



**పృధ్వి ప్రతినిధి నల్గొండ జిల్లా సెప్టెంబర్:** బీసీ నాయకుడు ఆర్కేష్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ ఎదుగుదలను ఓర్వలేకనే అనేక అడ్డంకులు ఎమ్మెల్యే ప్రోద్భలంతో పోలీసుల అత్యుత్సాహం.. కనగల్ మండల ఎస్.ఐ చర్యలు తీసుకోవాలి. కార్యకర్తల పట్ల బెదిరింపులు మానుకోవాలి చట్టం అందరికి సమానమే సంగతి పిల్లి రామరాజు యాదవ్... నల్లగొండ నియోజక వర్గ పరిధిలో ప్రజల వద్దకు,వినాయక విగ్రహాల దగ్గరకు వెళ్తున్న క్రమంలో పోలీసులు అనేక ఆటంకాలు సృష్టిస్తూ,రాజకీయ ప్రోద్భలంతో అడ్డుపడుతూ, నన్ను,నా కార్యకర్తలను బెదిరిస్తున్న కనగల్ మండల ఎస్.ఐ మరియు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్.కే.ఎస్ ఫౌండేషన్ చైర్మన్, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ డిమాండ్ చేసారు. నిన్నటి రోజున కనగల్ మండల కేంద్రంలో జరిగిన ఘటనపై శుక్రవారం రోజున స్థానిక నల్లగొండ డిఎస్పి శ్రీధర్ రెడ్డికి కనగల్ మండల ఎస్సై అంతిరెడ్డి పై ఇతర పోలీసులపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి నల్లగొండ నియోజక వర్గ పరిధిలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సంసిద్ధులుగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులందరూ ప్రజలకు వినాయక విగ్రహాలు ఇప్పించి ఉన్నారన్నారు. నేను కూడా నల్లగొండ నియోజక వర్గం లోని వివిధ గ్రామాల ప్రజలకు,పట్టణ పరిధిలోని వివిధ వార్డుల ప్రజలకు విగ్రహాలు ఇప్పించి ఉన్నాను అన్నారు. ఆ ప్రజలు విగ్రహాల వద్దకు పూజా కార్యక్రమాలలో పాల్గొనమని పిలిచినప్పుడు నేను నా కార్యకర్తలతో కలిసి పాల్గొంటున్న సందర్భంలో నేను నా కార్యకర్తలతో కలిసి కలిసి ఉన్నాను. కావాలనే ఉద్దేశాలతో నాపై వ్యక్తిగతంగా కక్ష సాధించాలని బిసి ఒక బహుజన నాయకుడు ఎదగకుండా అడ్డుపడుతున్నాడు నల్గొండ ఎమ్మెల్యే కచ్చితంగా ప్రజలు గమనిస్తున్నారు రేపు రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఒంటరిగా పోటీ చేస్తానని మీడియా ముఖంగా తెలియజేస్తున్నాను ఎవరేమన్నా ఎవరు ఎన్ని బెదిరింపులు చేసినా కచ్చితంగా బరిలోనే ఇంకా అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడిగా మీల రాజ్ కుమార్




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22(పృధ్వి న్యూస్ ):** శేరిలింగంపల్లి నియోజిక వర్గం లోని జనసేన పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడిగా మీల రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సంధర్భంగా మీల రాజ్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ , గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధారాం రాజలింగం, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంఛార్జ్ డాక్టర్ మాధవ రెడ్డి, నియోజకవర్గ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పచెప్పినందుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం అంకితభావంతో పనిచేస్తానని, గచ్చిబౌలి లోని ప్రతి ఓటర్ వద్దకు, యువతకు జనసేన పార్టీని చేరుస్తానని అన్నారు. గచ్చిబౌలి లో జనసేన పార్టీని బలోపేతం చేసేవిధంగా కార్యకర్తలను నిర్మాణం చేస్తానని, ప్రజలతో మమేకమై, సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ, ప్రభుత్వం మరియు యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను పరిష్కరించి, ప్రజలకు జనసేన పార్టీ పై నమ్మకం కలిగేలా కృషి చేస్తానని తెలిపారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in